రక్త స్పర్శ

శివానికి చాలా దాతనవు—బడి ఎగగొట్టటమూ, బలవంతాన పంపించిన రోజున మేష్టరు కళ్ళల్లో కారం కొట్టి తప్పించుకు పారిపోవటమూ, మేష్టరు వెయ్యి కళ్ళతో కని పెట్టి ఉండి, కడంపిల్లల జోక్యం మానేసి, వాడిచేత గంట సేపు ఒకే పాఠం చదివించినా ఒక్క ముక్క రాకుండా పరధ్యానంగా చదవటమూ, తన ఈడు పిల్లవాడెవడైనా ఒంటరిగా దొరికితే వాడితో ముందు పరిచయం చేసుకుని తరవాత పోట్లాడి ఆఖరుకు వాణ్ణి మెత్తగా తన్నటమూ, అది సాధ్యపడనప్పుడు చచ్చేటట్లు తన్నులు తిని ఎవరితోనూ చెప్పకుండా ఉండటమూ, వారాని కొకసారి ఏదో ఒక విధంగా ప్రాణంమీదికి తెచ్చుకోవటమూ, సినిమాలకూ, నాటకాలకూ, సర్కసులకూ టిక్కెట్టు లేకుండా వెళ్ళటమూ,

బొగ్గుతో ఊళ్ళో గోడల మీద తన నోటికి వచ్చిన దౌర్భాగ్యపు బూతలు రాయటమూ, సిగరెట్లు (కానీకి అయిదు రకం) కాల్చటమూ. ఇంకా ఎన్నో! కాని వాడికి ఆడపిల్లల దగ్గిర ఎట్లా ప్రవర్తించాలో చాతకాదు. వాడి కసలు ఆడపిల్లలంటే భయం. ఆ భయం జాస్తిగా కలిగినప్పుడు వాళ్ళకు వైదొలిగి, తను పాతికేళ్ళ మగవాడయినట్టూ, వాళ్లు కాపరం చేసేవాళ్ళయినట్టూ, ప్రవర్తించేవాడు. కాస్త ఉత్సాహం ఉండి, భయాన్ని కొంతవరకు జయించినప్పుడు తనూ, వాళ్ళూ, చంటిపిల్లలయినట్టు ప్రవర్తించేవాడు. వాడి ఈ ప్రవర్తనే ఆడపిల్లలకు రోతగా ఉండేది.

ఇవాళ వాడు ఉత్సాహంతో ఉన్నాడు. మొదటి సంగతి : బడి ఎగగొట్టేశాడు. ఆ తరవాత : వాళ్ళమ్మ గూట్లో పెట్టి మరచిపోయిన అణా కాసొకటి కొట్టేశాడు. ఇంతే కాక వాడు ఎన్నడూ ఎరగని కిల్లీకొట్టు మీదికి వెళ్ళి "ఏమయ్యోయ్. ఒక బీడీ ఇవ్వు!" అని దబాయించి అడిగి ఆ బీడీ సంపాదించాడు! ఈ ఉత్సాహంలో వాడు ఇంటికి వచ్చేటప్పటికి లక్ష్మి, పక్కింటివాళ్ళ బాలాంబా కలిసి సారెబొమ్మలకు గుడ్డ పీలికలతో దుస్తులు కుట్టుకుంటున్నారు.

శివం కాసేపు కాలక్షేపంగా పెట్టి వాళ్ళ కార్యక్రమం నిష్పక్షపాత బుద్ధితో గమనించి, అఖరుకు వొంగి ఒక చిన్న గుడ్డపీలిక తీసి లక్ష్మి నెత్తిన వేసి, "ఒకమ్మాయిగారి నెత్తిన గోరంకి!" అని పాడాడు. బాలాంబ ఒకసారి వాడి వంక తీవ్రంగా చూసి వా దక్కడ లేనట్టే నటించింది.

లక్ష్మి మాత్రం వాడి వంక రౌద్రంగా చూసి, నీ కాడపిల్లలుతో ఏమాటలురా? అసలు నువ్వు బళ్ళోకి వెళ్ళక ఇక్కడున్నావేం? అమ్మతో చెప్పనా?" అని అంతకంతకూ గొంతు హెచ్చించసాగింది. వంట ఇంట్లో ఉన్న తల్లికి వినపడాలని ఆ పిల్ల తాత్పర్యం.

శివం తన నిర్లక్ష్యం ప్రకటించటానికి అసహ్యంగా నవ్వుతూ, మళ్ళీ వొంగి లక్ష్మి చేతిలో ఉన్న బొమ్మ లాక్కున్నాడు.

ఈసారి లక్ష్మి గట్టిగా అరుస్తూ "ఆ బొమ్మ ఇచ్చెయ్యరా! నీకేం తెగుల్రా? .... అమ్మా, ఈ శివాయ్ చూడవే! మమ్మల్ని ఏడిపిస్తున్నాడూ .... వెధవా!" అన్నది.

"నువ్వే వెధవ ముండవు!" అంటూ శివం లక్ష్మి నెత్తిన ఆ బొమ్మతో ఒకటి పెట్టి, తృప్తిపడక మళ్ళీ ఇంకోటి పెట్టి, ఆ బొమ్మ ఎత్తి నాపరాళ్ళమీద వదేసి ఎటో అయిపు లేకుండా వెళ్ళిపోయినాడు.

రేపో ఎల్లుండో పెళ్ళి కాబోతున్న లక్ష్మి, పైగా తన స్నేహితురాలి

ముందు, అసహాయత్వం ప్రకటించటానికి గాని, ఏడవటానికిగాని చాలా బిడియ పడ్డది. బయటికి కక్కిన కోపం కంటె దిగమింగిన కోపం రెట్టింపు! లక్ష్మి పెదిమలు మాత్రం కదిలిస్తూ శివాన్ని లోలోపలే "వెధవ, వెధవ, వెధవ!" అని లెక్కపెట్టకుండా పదమూడుసార్లు తిట్టుకున్నది.

ఈ సంఘటన లక్ష్మికి, బాలాంబకూ ఎంత అసహ్యకరంగా కనిపించిందో, శివానికి అంత అసహ్యంగానే తోచింది. కాని ఏం చేస్తాడూ! తను ఎంతో సదుద్దేశంతో ఏం చెయ్యబోయినా ఆఖరుకు అట్లా పరిణమిస్తుంది. ప్రపంచం అంతటా లక్ష్మి వంటి దుర్మార్గు లుండటంవల్ల తన చేతలన్నీ ఇట్లా పరిణమించుతై. తన లోపం ఎన్నడూ ఉండదని శివం ఎప్పుడూ ఎరుగును. వాడికసలు అక్కమీద ఎంతో అపేక్ష, అభిమానమూ ఉన్నై (లక్ష్మి మీద చెయ్యి చేసుకున్న మరు క్షణం ఆ సంగతి వాడికి ఎంత నమ్మకంగానో తెలిసేది). కాని ఏం లాభం? ఆ అపేక్ష చూపించేటందుకు తనకు అవకాశమే దొరకదుగా! తన ప్రారబ్ధం!

పశ్చాత్తాపం అందరికీ ఒకవిధంగా రాదు. ఇది శివం యొక్క పేటెంటు విధం. వాడు తన దృష్టిలో తాను హీనుడల్లే కనపడేకంటే తనవల్ల అపకారం పొందిన వాళ్ళని తన దృష్టిలో అధికం కానిచ్చేవాడు. ఇటువంటి సంఘటన– లక్ష్మి మీద చెయ్యి చేసుకోవలసిన అవశ్యకత – కనీసం రోజు కొకసారి అయినా కలుగుతూ ఉండేది కనక ఈ పాటికి లక్ష్మి శివం దృష్టిలో దాదాపు ఒక దేవతంతగా అయిపోయింది. అయితే ఈ విషయం నిరూపించటానికి శివాని కింకా అవకాశం రాలేదు. ఈ పరమ రహస్యం ఇంకా శివం హృదయం లోనే బంధించి ఉంది.

*　　　*　　　*

లక్ష్మి తమ్ముడి కంటె సరిగ్గా ఒక సంవత్సరం పెద్ద. వాడికి పదో ఏడు వచ్చింది – ఇంకా ఏ బి సీ డీ లు రాకపోయినా, లక్ష్మికి పదకొండు వచ్చినయి. తమ తండ్రిని ఇద్దరూ ఎరగరు. వాళ్ళు బుద్ధి తెలిసినప్పటినించీ తల్లి శిక్షణ కిందనే పెరిగారు.

ఆవిడకు పిల్లల్ని పెంచటం ఏమీ చాతకాదు. చాతకాదని ఆవిడకుగాని, ఆవిడని మెచ్చుకున్న వాళ్ళకుగాని తెలీదు కూడాను. ఆవిడ తన ఇద్దరు పిల్లల్ని ఒకరిమీద ఒకర్ని కాపలా పెట్టిందీ. వాళ్ళిద్దరికీ సహజమైన వైరం ఉంటుందని ఆవిడ విశ్వాసం. (ఆ విశ్వాసానికి ఆధారాలేమిటో నాకయితే తెలీదు!) కాని వాళ్ళ ప్రవర్తననుబట్టి ఆవిడ విశ్వాసం సరి అయినదేనని ఎవరైనా భావించ

వచ్చును. యథార్థ మేమిటంటే, వాళ్ళ ఈ ప్రవర్తనకు ఆవిడ విశ్వాసమే కారణం. ఆ ఇల్లాలు తన పిల్లలిద్దర్నీ ఒకరిమీద ఒకరిని కావలా పెట్టటమేకాక ఒకరినించి ఒకరిని సంరక్షించటంలో చాలా ప్రయాసలకు లోనయ్యేది. ఆ ఇద్దరి లోనూ ఏ ఒకరుగాని రెండోవారి మీద ఏ నేరం మోపినా సరే, ముందూ వెనకా ఆలోచించకుండా శిక్షించేది. ఎవరి విషయంలో వారు నిజం చెప్పరని ఆవిడ కెంత విశ్వాసమో, రెండోవాళ్ళ విషయం అబద్ధం చెప్పరని కూడా ఆవిడ కంతే విశ్వాసం.

ఎప్పటికన్నా ఈ ఇద్దరూ ఒకటవుతారని కాని, కావచ్చునని కాని ఆవిడకు తట్టలేదు. తమ్ముడికి అండగా నిలవాలనే భావం మొదట లక్ష్మికే కలిగింది. ఆ పిల్ల తమ్ముడి దుష్ప్రవర్తన జాస్తి అవుతున్నకొద్దీ వాటిని తల్లిదగ్గిర బయట పెట్టటం తగ్గించింది – బయటపెడతానని తమ్ముణ్ణి బెదిరించటం జాస్తిచేసినా, శివం తన విషయంలో అటువంటి ఔదార్యం ఇంకా పూనలేదనే విషయం కూడా లక్ష్మిని బాధించలేదు.

లక్ష్మి యొక్క మనస్తత్వానికి కారణాలు నిశ్చయించటం సులభంకాదు. దానికి కారణం స్త్రీలకు అధికంగా ఉండే సహనశక్తి కావచ్చు; లక్ష్మిలో త్వరగా వికసించిన మాతృత్వం కావచ్చు, ప్రతిఫలం కోరని సోదరీ ప్రేమ కావచ్చు; తల్లివల్ల తమ్మునికి కలిగే శిక్షలో ఉండే న్యాయంలో అవిశ్వాసం కావచ్చు! ఇవేవీ కాకపోతే ఇందు మూలంగా తమ్ముడి మీద తనకు దిన దినమూ జాస్తి అవుతున్న అధికారం మీది తీపి కావచ్చు.

కాని క్రియకు జరిగిందేమంటే, లక్ష్మికి తమ్ముడి మీది ప్రేమ రహస్యంగా వృద్ధి కాసాగింది – ఆ ప్రేమకు శివం అనర్హుడవుతున్నకొద్దీ మనం క్షమించగలిగిన మనిషిని ఎప్పటికీ ప్రేమించలేం సరే కదా, మన శిక్ష ఎంత న్యాయమైనదైతే మనకు ప్రేమ అంత అసాధ్య మవుతుంది! ఈ రహస్యం తెలియక ఆ పిల్లల తల్లి తన సంతానాన్ని ఎప్పుడూ న్యాయంగానే శిక్షించేది! ఆవిడ తన పిల్లల్ని అన్యాయంగా శిక్షించినా పశ్చాత్తాపం ద్వారా ప్రేమ సాధ్యమై ఉండును – శివానికి రహస్యంగా అక్క మీద ప్రేమ ఉండినట్టు.

* * *

లక్ష్మికి సంబంధం విచారిస్తున్నారు. అది ఏ క్షణాన పెద్దమనిషి అవుతుందోనని ఒకరి కొకరు అవకాశం దొరికినప్పుడల్లా చెప్పుకోవటం ఫాషనుగా ఉంది వాళ్ళ బంధువర్గంలో. నిజానికి లక్ష్మిలో అటువంటి లక్షణాలింకా ఏమీ లేవు. అది పదకొండేళ్ళ పిల్ల అంటే ఎరగనివాళ్ళు నమ్మటం కూడా కష్టమే. శివం అక్క కన్నా కనీసం రెండేళ్ళు పెద్దవాడనిపిస్తాడు. కనక ఆ భయం

నిజంగా ఎక్కువ మందికి లేదు. పైగా అటువంటి అపూర్వమైన సంఘటన జరిగితే ఏమవుతుందో తెలుసుకుందామని లోపల చాలామందికి ఉంది కూడానూ.

"నీకు రావణాసురుడంటి మొగుడు రావల్లే! అప్పుడు గాని నువు చచ్చినట్టు పడి ఉండవు!" అనేవాడు, శివం ఇంచు మించు ప్రతి రోజూ. పైకి అట్లా అంటూనే వాడు లోలోపల ఆశ్చర్యపొయ్యేవాడు తన నోటికి. తన హృదయానికి ఉన్న వైరం చూసి. తన మనస్సును నోటితో దాస్తున్న సంగతి వాడెరగడు. వాడికంత ఆత్మజ్ఞానం లేదు.

లక్ష్మికి సంబంధం విచారిస్తున్నది దాని పినతండ్రి. ఆయనగారిని చూస్తే శివానికి మొదటి నుంచీ పైకి భయమూ, లోపల కోపమూనూ, (వాడి చదువు విషయమూ, వాణ్ణి హద్దులో ఉంచాలనే విషయమూ మొదటినించీ ప్రచారంచేస్తూ వచ్చింది ఆ పెద్దమనిషే!)

ఆయన లక్ష్మి పెళ్ళి బరువంతా తన మెడ మీదనే ఉన్న సంగతి ఏ మాత్రమూ దాచకపోగా అప్పుడప్పుడూ "అబ్బబ్బ! సొంత పిల్లలకు సంబంధం వెతకటమే కష్టం! మరొకరి పిల్లలకు వెతకటం కంటె బాధుకో పని ఇంకోటి ఉండబోదు!" అని ఆపసోపాలు పడేవాడు.

ఆయన ఆ మాట అన్నప్పుడల్లా శివానికి శివమెత్తేది. తన అక్క పెళ్ళి భారాన్ని తన పినతండ్రి సంతోషంతో భరించాలని వాడి అభిప్రాయం కావచ్చును! అంత అయిష్టంతో చేసే సహాయం స్వీకరించటానికి తన తల్లి కెట్లా సిగ్గు లేదా అని వాడికి అనిపించేది. అది అట్లా ఉండగా ఆ పినతండ్రి సొంత అల్లుణ్ణి వెతకటానికయితే ఎంత శ్రమ పడునో అందులో కొంత మాత్రమే పడి లక్ష్మికి మొగుణ్ణి తీసుకురాబోతున్నాడని అస్పష్టంగా అర్థం చేసుకుని శివం మనస్సు అదొక విధమైన ఆరాటంలో పడసాగింది. ఆ ఆరాటానికి తగినట్టే లక్ష్మిని చూడటానికి వచ్చే ఒక్కొక్క వ్యక్తిని కళ్ళారా చూస్తున్న కొద్దీ దాని పెళ్ళి జరగవలిసినట్టు జరగదనే భయం శివానికి జాస్తి కాసాగింది.

అప్పటి మన స్థితిలో లక్ష్మిని పెళ్ళాడటానికి సాక్షాత్తూ ఆ నిషదేశ్వరుడే వచ్చినప్పటికీ అతను శివం యొక్క తీవ్ర విమర్శకు గురి కాకుండా తప్పేటట్టు లేదు—వాడి పినతండ్రి ఆటే కట్నం ఖర్చు లేకుండా చూసి తెచ్చిన చవుకబారు సంబంధాలొక లెక్కా?

ఆఖరుకు లక్ష్మి వివాహం స్థిరమయింది. పిల్లను చూడటానికి వరుడు స్వయంగా రాలేదు; తన తల్లినీ, అక్కగారినీ తోడిచ్చి తండ్రి పంపాడు. ఆ వచ్చిన వారి అందచందాలను బట్టి వరుడు మీద శివానికి మంచి అభిప్రాయం కలగలేదు (ఆ విషయం విచారించినవారు లేకపోవటం శోచనీయాంశం!)

వచ్చినవారు పిల్లను చూసి, నిరత్యంతరంగా మెచ్చుకున్నారు. ("మీ వెధవ మెప్పెవరికి కావాలి? మా అక్కయ్య మీ ప్రాణాలకి భూలోక రంభే!" అనుకున్నాడు శివం నిర్లక్ష్యంగా!)

వరుడు స్కూలు ఫైనలు దాకా చదివి మానేశాడని విని లాగుముడి నమ్మకంగా విప్పుకోలేని శివం — స్కూలు ఫైనలు దాకా చదువుదామనే ఆశ గాని ధైర్యం గాని లేని శివం — పెదిమ విరిచాడు.

వరుడికి బోలెడంత ఆస్తి ఉందని తెలిసి శివానికి మండిపోయింది. ఆ ఆస్తికి లక్ష్మని బంధువులంతా కలిసి విక్రయిస్తున్నారని శివం తన అంతరాత్మలో రూఢి చేసుకున్నాడు.

బంధువులంతా కలసి ఈ సంబంధం చాలా బాగుందని ఒకరితో ఒకరు అనుకుంటున్న కొద్దీ శివానికి ఒంటరితనం దుర్భరమైపోయింది. తన పక్షం పలికే వాడు ఒక్కడన్నా లేడా? ఇంతమందీ కట్టుకట్టి తననూ, లక్ష్మనీ ముంచాలని చూస్తున్నారా? తన కింకా నాలుగేళ్ళు — కనీసం మరో రెండేళ్ళు — ఉన్నట్టయితే వీళ్ళ ఆటలు సాగునా?

తన బాధ కంతా కారణం అసూయ అని శివం ఎరగడు. వాడి కెవరు చెబుతారు? అసలు వాడు బాధపడుతున్న సంగతి ఎవరెరుగుదురు — వాడి స్నేహితుడు హనుమంతాయి తప్ప!

హనుమంతాయీ, తనూ చెరువుగట్టున కూర్చుని లక్ష్మి పెళ్ళి విషయం చాలా సేపు చెప్పుకున్నారు — బీడీలు కాలుస్తూ! కనీసం తను చెబుతుంటే హనుమంతాయి సహృదయంతో విన్నాడు.

"వాడు వట్టి పల్లెటూరి గబ్బిలాయిరా!" అన్నాడు — శివం — బీడీ పొగ వదులుతూ. మొహంలో ఒక విధమైన విచారమూ, బీడీ మాటూ కనబరుస్తూ. "డబ్బుంది వెధవకు! అయితే చదువు లేదు వెధవకు. వెధవ కోతి మాదిరిగా ఉంటాడు!" (తను వరుణ్ణి చూడలేదన్న సంగతి హనుమంతాయితో చెప్పకపోతే నేం? రేపు రుజువయ్యే విషయమేగా!)

హనుమంతాయి కొత్త బీడీ పాత బీడీతో అంటిస్తూ, "ఈ పెళ్ళిళ్ళు....!" అన్నాడు గంభీరంగా.

*　　　*　　　*

శివం బావమరిది కనకయ్య తన బావమరిది అంటే మొదటినించీ ఒక విధమైన వాత్సల్యం కనబరుస్తూ వచ్చాడు. ఈ వాత్సల్యం శివం హృదయంలో ఎటువంటి మంట పుట్టించిందీ కనకయ్య ఎరగడు.

కనకయ్యను శివం ఏ విధంగానూ క్షమించలేక పోయినాడు. కనకయ్య అసలు ఎవడూ? తన్ను "ఒరేయ్" అని పిలవటానికి. ఏవైనా పనులు చెప్పటానికి వాడికి ఏ మధికారం ఉందీ? లక్ష్మి మొగుడై తూర్పోవటాని కే మధికారం ఉందీ? వాడు (తనలో తను తన బావమరిదిని వాడనుకోవటానికి కూడా శివానికి చాలా సాహసం కావలసివచ్చిందని పాఠకు లూహించాలి!) వాడు తను అనుకున్నంత కోతిగా ఉండకపోవటమే? బావమరిది అయినందుకే తనకింతగా పనులు చెప్పి తనమీద అధికారం ఛలాయిస్తున్నవాడు రేపు లక్ష్మిమీద ఎంత అధికారం చలాయించడూ?

పెళ్ళివైభవమూ, ఉత్సాహమూ తనని అంటకుండా ఉండేటందుకు శివం తన యీడుకుమించిన అమానుషమైన ప్రయత్నంచేసి గెలిచాడు. ఆ అయిదు రోజులూ పెడపెడగా తిరిగాడు; వెలుతురుకూడా రాని మూలల నక్కాడు; ఎవరికీ కనిపించలేదు; భోజనంకూడా సరిగా చెయ్యలేదు; కొత్తబట్టలైనా కట్టుకోలేదు. అయితే ప్రత్యేకించి శివం విషయం గమనించినవారు లేకపోయినారు.

పెళ్ళికూతుర్ని చేసిన లక్ష్మి అందరికీ నేత్రపర్వంగాఉంటే శివం కళ్ళకి ఎవరోఅల్లే కనిపించింది. దానివంక చూసి వాడు, "ఇది నా అక్క!" అని అనుకోలేకపోయినాడు; చూడలేకపోయినాడుకూడానూ! పెళ్ళయిన నెలదాకా లక్ష్మి వారి దృష్టిలో మామూలు మనిషి కాలేదు.

పెళ్ళి అయిన రోజునించీ అక్కా తమ్ములకు కొత్త సంబంధం ఏర్పడ్డట్టయింది. ఇద్దరూ పరస్పరానురాగం వెనకటికన్నా స్వేచ్ఛగా చూపించసాగారు. ఈ విషయంలో శివానిది పరిపూర్ణమైన పరివర్తన. వాడు లక్ష్మి వివాహం గురించి తన అభిప్రాయం స్పష్టంగా లక్ష్మికి తెలియచేశాడు. లక్ష్మి తమ్ముడి ఉద్రేకం అర్థం చేసుకోలేదుగాని, వాణ్ణి మార్చటానికి ఏ ప్రయత్నమూ చెయ్యలేదు. శివం తనని గుచ్చి అడిగినప్పుడు మాత్రం తనకే సంబంధమైనా ఒకటేనని తమ్ముణ్ణి నమ్మించింది. ఆ నమ్మకం శివం ఆరాటాన్ని కొంతవరకు తగ్గించింది. కాని సంతృప్తి మాత్రం కలిగించలేదు. తనకు సరిఅయిన భర్త రాలేదని లక్ష్మి ఎప్పటికైనా తెలుసుకుంటుందని శివం లోలోపల భయపడుతూనే ఉన్నాడు.

శివానికి తన బావమరిదితో ప్రవర్తన ఎంతకాలానికీ గాడిలో పడలేదు–కుదరలేదు. దారుణమైన దురభిప్రాయంతోనూ, ఏవగింపుతోనూ ప్రారంభించి శివం తన్ను తను సంస్కరించుకునే ప్రయత్నంలో కనకయ్యకు అతిమంచిగా పరిణమించాడు. మళ్ళీ దాన్ని సంస్కరించుకునే ప్రయత్నంలో అతి ద్వేషం

ప్రకటించాడు. శివం ప్రకృతి కనకయ్య మీదిగా అటునించి ఇటూ, ఇటునించి అటూ ఉయ్యాల లూగసాగింది.

"మా బావమరిదితో ఎటుపోయినాచిక్కే. మరో నిమిషానికి వాడి బుద్ధి ఎట్లా ఉండేదీ తెలీదు. వాడికి మొత్తానికి చపలచిత్తమే" అని కనకయ్య నిర్ధారణ చేశాడు — శివంతో తగుమాత్రం అనుభవం అయిన మీదట.

ఒళ్ళుపై తెలియకుండా తిరిగేవాడు. ఒకదెబ్బ తిన్న మీదట కొంత నిషా దిగి, ఇంకా దెబ్బలు తగిలినకొద్దీ మామూలు మనిషికింద మారి బాధ్యత గుర్తించటం నేర్చుకుంటాడు. లక్ష్మి పెళ్ళి శివానికి దెబ్బగా పరిణమించింది. వాడి పొగరు కనీసం సగమైనా చచ్చింది. చదువుమీద వాడికి కొంత ధ్యానం పుట్టింది. ప్రశ్నలకు మరీ కొక్కిరాయి సమాధానాలివ్వటం చాలవరకు తగ్గించాడు.

*　　　　*　　　　*

లక్ష్మి పెళ్ళికి ఇరవై అయిదువందలు అప్పయింది. ఖర్చు అమితంగా అయిందని విమర్శించినవాళ్ళతో శివం పినతండ్రి తగూ పెట్టుకోలేదు. ఆయన ఏమాత్రమూ చలించకుండా "ఇదే నా కూతురు పెళ్ళి అయితే పదిహేనువందల పైన ఒక్కకానీ అయిఉండదు" అనేశాడు. పరోపకారం చెయ్యటంలో ఉన్న కష్టసుఖాలు ఆ ఒక్క ముక్కలోనే విదితమయినై — అర్థం చేసుకోగలవాళ్ళకి.

ఈ పెళ్ళిలో ఆ పెద్దమనిషి కనీసం నాలుగైదువందలు కొట్టేశాడని వదంతి ఒకటి వడింది. కాని ఈమాట ఆయనతో ఎవరూ అనలేదు. అంటే తప్పక చక్కని భావగర్భితమైన సమాధానం ఇచ్చి ఉండేవాడే.

జరిగిందేమో జరిగిపోయింది. ఈ బాకీ తీరేమార్గం కనిపించలేదు — ఉన్న ఏడెనిమిదెకరాల భూమిలో కొంత అమ్మటంతప్ప. అనాదిగా (అంటే పదిహేను సంవత్సరాలనించీ) వస్తున్న పొలంలో ఏడోవంతో ఎనిమిదోవంతో అమ్మటం అందరికీ కష్టంగానే ఉంది. కాని అమ్మకం తప్పదని అంతా గ్రహించారు. అయితే ఇక్కడ మళ్ళీ శివం పినతండ్రిగారి లౌక్యజ్ఞానం చాలా ఉపయోగపడింది.

"ఆ బాకీ దానంతట అదే చెల్లుబడిపోతూంది. శివం చదువు పూర్తిచేసి నాలుగురాళ్ళు సంపాదించి వాడిపొట్ట వాడు పోసుకోవటం మొదలుపెట్టగానే పొలంలో వచ్చేదీ ముట్టుకోనవసరం ఉండదు. దానితో అప్పుకాస్తా తీర్చవచ్చు. ఈలోపల ఉండే ఏసాలుకాసాలు ధాన్యం అమ్మేసి బాకీలో చెల్లువేసేదీ. ఏనెల కావలసింది ఆనెల అప్పుచేస్తూ ఉండేదీ! బంగారంవంటి పొలం ఎందుకు పాడు చేస్తారు? మళ్ళీ మన శివం సంపాయించబోయినాడా, పెట్టబోయినాడా?" అన్నాడా పెద్దమనిషి.

"నేను సంపాదించటమూ, పెట్టటమూ లేకపోతే ఆ బాకీ తీరనే తీరదుగా! నేను సంపాయిస్తే ఈమాత్రం పొలం అప్పుడే కొనుక్కోవచ్చుగా!" అన్నాడు శివం తెలివిగా. ఆ ముక్కతో పినతండ్రి పడిన కంగారు వాడికి తనలో మూడో వంతు వయసులేని సత్యం, ప్లీడర్లు కూడా మాట్లాడలేని తనతో ఇట్లా మాట్లాడటం సహించలేక వాడి పినతండ్రి వెర్రివాడల్లే పేలాడు. ఆ పేలాపనయొక్క సారాంశం ఏమంటే, "శివం సంపాయించదని తన అనుమానమేకాని సంపాయించకుండా ఉండాలని తన అభిప్రాయంకాదు; ఇప్పుడు రెండెకరాలు పోగొట్టుకుంటే ఈ రెండెకరాలే రమ్మంటే ఎప్పుడూరావు!"

చిన్న పిల్లలుకూడా అర్థం ఉన్న తెలివిని విమర్శించగలరు - కాని ఇటువంటి అర్థమూ, సందర్భమూలేని అతితెలివిని విమర్శించలేదు. శివం మళ్ళీ నోరెత్తలేదు.

శివంగారి కుటుంబానికి సంవత్సరానికి సుమారు అయిదువందల రాబడి. లక్ష్మి పెళ్ళికయిన అప్పుమీద వడ్డీ మూడువందలు. కనక రాబడి అప్పులో చెల్లువెయ్యటంవల్ల అసలులో రెండువందలు మాత్రమే చెల్లుపడేది. పైగా ఈ కుటుంబానికి నెలకు ముప్పై అయినా లేకుండా జరగదు. ఈ నాలుగువందలూ చిల్లరచిల్లరగా అప్పు తీసుకురావటంవల్ల వడ్డీ ద్వారా కలిసివచ్చేది. ఉజ్జాయింపున సంవత్సరానికి పాతిక రూపాయలుంటుంది. ఈ పాతిక రూపాయలకోసం ఒక అప్పులవాడికి మరో ఏడెనిమిదిమంది చిల్లర బాకీదార్లు జత అయినారు. కాస్త ఆలస్యమై డబ్బు అనుకున్ననాటికి అందకపోతే ఇంట్లో బియ్యానికీ, ఉప్పుకీ, పప్పుకీ కూడా గిజగిజలాడుకోవలసి వచ్చేది. చివరకు ఏ విధంగా పరిణమించిందంటే, పొలంమీద వచ్చేది సంవత్సరమల్లా చేసిన బాకీలు తీర్చటానికి మాత్రమే సరిపొయ్యేది. హాయిగా డబ్బు దగ్గిర పెట్టుకుని జీవించే కుటుంబం చేబదుళ్ళ మీద బతకవలసివచ్చింది. పెద్ద బాకీలో మొదటిసారివేసిన అయిదువందల చెల్లుతప్ప మరోకానీ చెల్లుకూడా పద్దపాపాన పోలేదు! శివం పినతండ్రిగారి లౌక్యానికి ఫలితం ఇదీ.

పొదుపుగా జీవించడమంటే డబ్బుకోసం ఇబ్బందిపడుతూ ఉండటమేనని విశ్వసించే శివం తల్లి కి ఏర్పాటు సమ్మతమయింది. శివానికిది ఏ మాత్రమూ రుచించలేదు. వారు ఒక కానీ పెట్టి కొనుక్కు తినాలన్నా, ఒక అణా పెట్టి సినిమా చూడాలన్నా "అదుగో నువు సంసారం దివాలా తీస్తున్నావు!" అనేది తల్లి. "వెనక జరిగినట్టు కాదోయ్! ఇప్పుడు కాస్త ఒళ్ళు దగ్గిరి పెట్టుకుని ఉండాలి!" అనేవాడు పినతండ్రి - లక్ష్మి పెళ్ళినాటినించీ ప్రపంచాని కొక కొత్త శకం ప్రారంభమైనట్టుగా.

"ఉన్న బాకీలన్నీ నేను ఖర్చుచేసే కాన్లతోనూ, అణాలతోనూ తీర్చేటట్టు న్నారు!" అని శివం అంటే, పినతండ్రి "నాలుగు కాన్లు అణా! పదహారణాలు ఒక రూపాయి!" అని జ్ఞాపకం చేసేవాడు శివానికి. ఆయన ఆటే మాటల మనిషి కాదు!

* * *

1930 నడిమధ్యను ప్రపంచ ఆర్థిక పరిస్థితులు తల్లకిందైనప్పుడు ధనా భావంవల్ల శివం తన ఇంటరు చదువు కట్టిపెట్టి కొంప చేరవలసి వచ్చింది. అప్పటికి వాడి బాకీలు దాదాపు అయిదువేలకు చేరబడినయి. కుంగిపోయిన ధరలవల్ల ఆస్తి విలవ కూడా అంతే అయింది. బాకీదార్లంతా తొందరపడు తున్నారు.

ఈ సమయంలో కనకయ్య శివానికి దేవుడల్లే అడ్డపడ్డాడు — కనీసం అంతా ఆ మాట అన్నారు.

"నీ బాకీలన్నీ నేను తీరుస్తాను. ఏదైనా వ్యాపారం చేసుకునేటందు కొక అయిదువంద లిస్తాను. నీ పొలం యావత్తూ నాకు రాసివ్వు!" అన్నాడు కనకయ్య బావమరిదితో.

"ఏ ధర ప్రకారం?" అన్నాడు శివం.

"అందరూ తీసుకునే ధరే!" అన్నాడు కనకయ్య.

"అందులో బావమరదినై నువ్వు నాకు చేసే ఉపకారం ఏముందీ?"

"లోకులు తినేది నేనే తింటున్నానని నువ్వే సంతోషించరాదూ?" అన్నాడు కనకయ్య. "మరొకరికంటె నా కింకా తక్కువకే ఇవ్వొచ్చునే. నేనేం తినగూడనివాణ్ణా?"

"నువ్వు తినగూడనివాడివి కావు కాని నేను పెట్టలేనివాణ్ణి. మన బంధుత్వంలో కొంత లాభం పొందదగిన యోగ్యత మన ఇద్దరిలోకీ నాకే ఉంది. ఎవరినన్నా అడుగు" అన్నాడు శివం. వ్యవహారం మాటకారితనంలోకి దిగింది.

"ఈ ధరలు ఎప్పటికీ ఇట్లాగే ఉండిపోవు. ఎప్పటికైనా లేవవచ్చు. కనక నువ్వు నాకు ఉపకారం చెయ్యదలిస్తే ఒక పని చెయ్యి. ఈ బాకీదార్లు ఆగరు. ఆ బాకీలన్నీ నువ్వే తీర్చు. నేను నీకు నోటు రాస్తాను. కావలిస్తే నా ఆస్తి యావత్తూ తనఖా పెడతాను. కాస్త ధరలు హెచ్చగానే నా ఆస్తి బాకీ ఉన్నంత వరకు నువ్వే తీసుకుందువుగాని." అన్నాడు శివం ఆఖరుకు.

నిజానికిది కనకయ్యకిది ఇష్టంలేదు. ఆయన ఉద్దేశం బావమరిది ఆస్తి కలుపుకుందామనే. కాని ఆ మాట పైకి ఎట్లా అంటాడు? శివం చెప్పినదాని కాయన సరేనన్నాడు.

సమయానికి బాకీదార్లలో ఒకాయన శివానికి మంచి సలహా ఇచ్చాడు: "ఆస్తి మాత్రం తనఖా పెట్టకు. నీకు కానీ పుట్టదు. చాలా బాధ పడతావు. మీ బావమరిది వ్యవహారం తెలిసినవాడే నీ జుట్టు ఆయన చేతిలో చిక్కిన తరువాత నీకు దమ్మిడీ కావాలన్నా ఆయన ఇస్తే సద్దు. లేకపోతే లేదు. జాగ్రత్తసుమా!" అని ఆయన శివంతో చాటుగా అన్నాడు.

కనకయ్య శివం బాకీలన్నీ తీర్చి, వాడిచేత నోటు రాయించి తాకట్టు దస్తావేజు రాయటానికి స్టాంపులు కొని తెచ్చిన తరువాత శివం పెడకట్టైతనంగా "నోటు చాల్లే. మళ్ళీ ఇది కూడా దేనికి? డబ్బు దండగ!" అన్నాడు.

ఆశ్చర్యంతోనూ, కోపంతోనూ కనకయ్య నోట మాట రాలేదు. శివం ఆస్తి తాకట్టు పెట్టనని భీష్మించాడు. కనకయ్య విషం చాలా విధాల వెళ్ళ కక్కాడు. ఇందుకనే అయిన వాళ్ళలో లావాదేవీ పనికి రాదన్నాడు. మనిషిని నమ్మటానికి లేకపోయిన తరువాత ఏం లాభమన్నాడు.

"తాకట్టు కోసం ఇంత ఆరాటపడటంలోనే నీకు నాలో నమ్మకం లేదని తెలుస్తున్నది. నేను తాకట్టు పెట్టననటంవల్ల ఏదో గ్రహించినట్టు నటిస్తావేమిటి?" అన్నాడు శివం.

కనకయ్య తాకట్టు పెట్టితీరాలన్నాడు. లేకపోతే ముందు ముందు శివం చాలా పశ్చాత్తాపపడవలసి రావచ్చునని కూడా సూచించాడు.

శివానికి మండిపోయింది. తనుపడే పశ్చాత్తాపానికీ, లక్ష్మికీ సంబంధం ఉంటుందని వాడు గ్రహించగలిగాడు. కాని శివానికి భావాలను దాచగల శక్తి ఈ మధ్యకాలంలో అబ్బింది. వాడు నవ్వుతూ "పోనీ. ఇంకో ఆరునెల్లాగు, బావా ఈ లోపుగా ధరలు లేస్తే సరేసరి లేకపోతే. మళ్ళీ తాకట్లూ గోకట్లూ దేనికి, పొలమే రిజిష్టరుచేసి ఇస్తాను." అని ఉపాయంగా కనకయ్యను సమాధాన పరిచాడు.

"నీ యిష్టం వచ్చినట్టు ఏడుచుకో! చెబితే వినేవాడికేమైనా చెప్పొచ్చుగాని— అని తన సమ్మతిని తెలియబరచి కనకయ్య వెళ్ళిపోయినాడు. దగ్గరపడ్డ తండ్రి ఆబ్దికం కోసం లక్ష్మి మాత్రం ఉండిపోయింది.

* * *

ఆ రాత్రి అక్కా తమ్ముడూ ఒకరి హృదయాలొకరికి విప్పి చెప్పు కున్నారు. హృదయాలు విప్పుకోవటమనేది తెలుగు దేశపు మధ్యమ తరగతి కుటుంబాల్లో ఏకోదరులకు కూడా రోజూ సాధ్యమయ్యే పని కాదు. లక్ష్మితో మాట్లాడుతున్నప్పుడే శివానికి తెలుసును— మళ్ళా ఇటువంటి అవకాశం తన జీవితంలో లభించదని. మళ్ళా రేపటినుంచి తనూ, లక్ష్మి మామూలు అక్కా

తమ్ముళ్ళే. కాని ఈ రాత్రి అపూర్వమైనది. ఇటువంటిది లభించనే లభించదు. దొరికినప్పుడు దాన్ని సద్వినియోగపరచాలి.

తనకు మొదటినించీ అక్క అంటే ఎంత ప్రాణమయిందీ, అది చూపించ టానికి తనకు ఎట్లా సామర్థ్యమూ, సాహసమూ చాలకపోయిందీ, తన తల్లి పెంపకం తనని ఎట్లా పాడుచేసిందీ, తను లక్ష్మికి ఎటువంటి భర్తా, ఎటువంటి జీవితమూ సంప్రాప్తించాలని కోరిందీ, లక్ష్మి వివాహం తనకు ఎట్లా బాధ కలిగించిందీ, ఇప్పటికి కూడా దాన్ని తలుచుకున్నప్పుడు తన గుండె ఎట్లా నీరయేదీ విపులంగా చెప్పాడు.

"ఏదైనా చెప్పుకునేటందుకు గాని, అపేక్ష చూపించేటందుకుగాని, నాకూ-డా ఒకరున్నా రనుకునేటందుకు గాని నాకు నువ్వు తప్ప ఇంకెవ రున్నారే!" అన్నాడు శివం.

లక్ష్మి ఎక్కువ మాట్లాడలేదు. తనకు సంబంధించినంత వరకూ విధి తనకేమిస్తే దానితో పరిపూర్ణంగా తృప్తిపడటానికి సంసిద్ధురాలైనట్టు కనిపిం చింది. కాని దానికున్న అసంతృప్తీ, మనోవ్యథా శివాన్ని గురించేనని తమ్ముడికి తెలియచేసింది.

"నాదేమిటి? నేను దేనిలోకీ జమకాను. మొదటినించీ నేను దౌర్భాగ్యుణ్ణి. వెనక్కు తిరిగి చూసుకుని నా జీవితంలో ఇది జరిగింది కాదా అని సంతోషించే టందుకు లేదు! నేను ముట్టుకుంటే బంగారం మట్టి అయింది. నే నేం చెయ్య బోయినా పొద్దు ఎదురైంది. ఆడుకోబోయిన చోట దెబ్బలాటలు పుట్టించినవాణ్ణి కానూ? నా బతుకే అంత!

"నీకేం ఖర్మమే? ప్రపంచంలో ఇంతమంది యోగ్యులు, సమర్థులూ, డొక్కశుద్ధి అయినవాళ్ళూ ఉన్నారు; నువ్వందులో ఎవరికి పెళ్ళానివి కాదగవనీ! ఆ పల్లెటూళ్ళో ఎందుకు పడవలసి వచ్చిందీ? నీ బతుక్కి వంటా, ఇంటిచాకిరీ— మొదలూ, చివరా ఇంతేనా? ఒక పుస్తకాలు లేవు, సంగీతాలు లేవు, సర్కసులు లేవు, నాటకాలులేవు. పదిహేను రూపాయలు తెచ్చుకునే ప్లీడరు గుమాస్తా పెళ్ళాం నీ కంటే నయం. ఈ బస్తీ రోడ్లూ, బస్తీ ఆనందమూ, సౌకర్యాలూ, ఇవన్నా అనుభవిస్తుంది!" అన్నాడు శివం.

లక్ష్మి మాట్లాడలేదు.

"ఎప్పుడో నీ మొగుడికేదో ద్రోహం చేస్తాను!" అన్నాడు శివం కాసేపు ఆలోచించి.

"ఏమిటది?" అన్నది లక్ష్మి.

శివం ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా, "ఏమీలేదుగాని, దుర్మార్గుడు నామీది కోపం నీమీద చూపిస్తాడేమోనని భయంగా ఉంది!" అన్నాడు.

లక్ష్మి కళ్ళు మెరసినై. "ఏమిటాయన నామీద చూపించేది?" అన్నది. శివం ఒళ్ళంతా ఒక్కసారి పులకరించింది. ఆ క్షణంలో లక్ష్మి రక్తం శివం శరీరంలో ప్రవహించినట్టయింది!

*   *   *

తన బావమరిదికి తెలియకుండా అతి రహస్యంగా శివం పొలమంతా అమ్మేశాడు. క్రయం జరిగిన ఆరు నెల్లకి కొత్త పట్టాదారు పొలాన్ని స్వాధీనం చేసుకున్నాడు. డబ్బంతా శివం ఎక్కడ పాతేశాడో ఎవరికీ తెలియదు. ఈ వ్యవహారంలో శివానికి పినతండ్రి సహాయం పూర్తిగా ఉందని ఒక మాట పుట్టింది. మొత్తంమీద ఆ ఇద్దరికీ వెనక ఎన్నడూ లేని సఖ్యత ఒకటి ఏర్పాటయింది.

ఈ వార్త వినగానే లక్ష్మి, కనకయ్యా బయలుదేరి వచ్చారు.

"వెధవ. ఎంతపని చేశాడూ? వాడికింకా ఇల్లుందిగా, మీరు వెంటనే వాణ్ణి కోర్టుకీడ్చి అది కాస్తా వేలం వేయించండి. రూపాయికి పావలాలన్నా రాకపోతై? చెడిన సొమ్ముతోపాటే ఇవీనూ!" అన్నది లక్ష్మి, అప్రయత్నంగా చిన్నతనపు గొంతు తమ్ముడి విషయంలో ప్రయోగిస్తూ.

శివంమీద లక్ష్మి లేచిన లేవటం చూసి కనకయ్య ముగ్ధుడైపోయినాడు. దాని గొంతు తరువాత ఎన్ని రోజులదాకానో కనకయ్య తుప్పు చెవుల్లో మోగుతూనే ఉంది.

"....నేను చచ్చాననుకునే ఈ పని చేశావా?.... నేను మళ్ళీ ఇంకా నీ మొహం చూస్తానా? ఇంత ద్రోహంచేసి నువు నా గడప తొక్కుతావా?.... వెధవ పని చేస్తావా? నే నివ్వలేనని ఆ మహారాజు కాళ్ళమీద పడలేకపోయినావా! నీ ముష్టినోటు చించి నీ మొహాన ఎన్నడో పారేసేవారుగా!.... ఈ ముష్టి అయిదు వేలు నేచేత గడ్డి తినిపించిందిగాని ఆయన కిదో లెక్క అనుకున్నావా?...."

అక్షరాలా కనకయ్య అభిప్రాయాలు కావు గాని గొప్ప మాటలు! కనకయ్య భార్య ప్రవాహానికి అడ్డుపడలేక చూస్తూ ఊరుకున్నాడు. తనకు అయిదువేలు లెక్కలేకేంగాని లక్ష్మి మాటలు వినటానికి మహా శ్రావ్యంగా ఉన్నై.

మౌనంగా అక్కగారి ఉపన్యాసం వింటున్న శివం చెవులకు కూడా అవి శ్రావ్యంగానే ఉన్న సంగతి, పావం కనకయ్య ఎరగడు!

తరవాత వారం రోజులకు చూసుకుంటే, ఎంత వెతికినా శివం రాసిన నోటు కనిపించలేదు. అది పూర్తిగా అదృశ్యమయింది.

*   *   *

పది సంవత్సరాలపాటు లక్ష్మి, శివం ఒకరినొకరు చూసుకోలేదు. ఆఖరుకు లక్ష్మి మంచానపడి అవసానదశలో భర్తను దగ్గిరికి పిలిచి "ఒక్కసారి మా తమ్ముడికి కబురు చెయ్యండి!" అన్నది.

"వాణ్ణా_?" అన్నాడు కనకయ్య ఆశ్చర్యంతో.

"పిలిపించండి! ఇక నేను బతకను!" అని బతిమాలింది.

కనకయ్య సరేనన్నాడు. పది సంవత్సరాలు తనను వంచించిన భార్యను ఒక్కసారి వంచించిన కనకయ్య భగవంతుడి దృష్టిలో పతితుడై ఉంటాడు!

ఇంకో అయిదు నిమిషాలకు ప్రాణం పోతుందనగా ఒళ్ళు తెలిసి "వచ్చాడా?" అన్నది లక్ష్మి. శివం రాలేదని చెప్పాడు.

"రాడు!_వాడు రాడు! అని రావద్దన్నాను!" అని లక్ష్మి కళ్ళు మూసుకుంది. ఆమెను వెంటనే మైకం కప్పేసింది. ఆ మైకంలోనే ఆమె ఆత్మ శరీరాన్ని వదిలింది.

[ప్రథమ ముద్రణ : 1940 ఆంధ్రపత్రిక, ఉగాది సంచిక]